## సర్కారు బడిలో ప్రభుత్వ టీచర్ కొడుకుకు అడ్మిషన్



మెదక్ మున్సిపాలిటీ, జూన్ 16: మెదక్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న అక్బర్ తన కుమారుడు జాహెద్‌అలీని అదే పాఠశాలలో 8వ తరగతిలో సోమవారం చేర్పించాడు. ప్రైవేట్ పాఠశాలలో చేర్పించే ఆర్థిక స్థోమత ఉన్నా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరి మన్ననలు పొందాడు.

## బధిరుల పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి



పాపన్నపేట, జూన్ 16: కరీంనగర్‌లోని బధిరుల (చెవిటి,మూగ) పాఠశాలను ఇంటర్మీడియెట్, డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని ఆ పాఠశాల చైర్మన్ రామతీర్థం బాబాగౌడ్ సోమవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. చెవిటి, మూగ విద్యార్థులకు కరీంనగర్‌లో పదో తరగతి వరకు ఉండడంతో పై చదువులు చదవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇందుకు అనితా రామచంద్రన్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## ఇన్‌చార్జి మంత్రిని కలిసిన డీ.ధర్మారం గ్రామస్తులు



రామాయంపేట, జూన్ 16: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను డీ.ధర్మారం గ్రామస్తులు సోమవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఆయన స్వగృహంలో కలిసి, మంత్రిని సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో మాసాయిపేట మల్లేశం, బండారి మహేందర్‌గౌడ్, ఉడుత రాజేశం, దొమ్మాట రవీందర్ ఉన్నారు.

## మినీ ట్యాంక్‌ల ఏర్పాటుకు భూమిపూజ



నిజాంపేట, జూన్ 16: నిజాంపేటలోని ప్రధాన వీధుల్లో సంఘ సేవకుడు వెల్దుర్తి వెంకటేశగౌడ్ సొంత నిధులు రూ.1.50 లక్షలతో ఆరు మినీ ట్యాంకుల ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రామాయంపేట ఏఎంపీ మాజీ డైరెక్టర్ వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ కొమ్మాట బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మినీ ట్రక్ బోల్తా

నిజాంపేట, జూన్ 16: నిజాంపేటలోని గఢీం చెరువు కట్టపై నుంచి కిందికి ఉల్లిగడ్డలు తీసుకెళ్తున్న మినీ ట్రక్ సోమవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. చెరువు కట్ట వద్దనున్న బీటీ రోడ్డు వర్షం కారణంగా ధ్వంసమై ప్రమాదానికి కారణమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


## రెడ్డిపల్లిలో ఆరోగ్య శిబిరం



రెడ్డిపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నర్సాపూర్, జూన్ 16: మండలంలోని రెడ్డిపల్లి పీహెచ్‌సీలో మాన్సూన్ హెల్త్ క్యాంప్‌ను సోమవారంనిర్వహించారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు సాహిత్య రత్నా, మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్, ఆశవర్కర్ జ్యోతి, పంచాయతీ సెక్రటరీ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



ఖాజీపల్లి పద్మ

నర్సాపూర్, జూన్16: ఓ వివాహిత అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపల్లి నర్సింహులుకు మండలంలోని రుస్తుంపేట్ కు చెందిన ఖాజిపల్లి పద్మతో వివాహం జరిగింది. నర్సింహులు తన తల్లితో కలిసి నాగులపల్లిలో గల బంధువు ఒకరు అనారోగ్యంతో ఉన్నాడని వెళ్లారు. నర్సింహులు భార్య పద్మ రుస్తుంపేట్‌కు వెళ్తానని తన భర్తతో చెప్పింది. నర్సింహులు ఇంట్లో నుంచి బయలుదేరేటప్పుడు తన భార్య పద్మ ఇంట్లోనే ఉన్నది. ఇంటికి తిరిగి వచ్చేలోగా పద్మ ఇంట్లో కనిపించలేదు. ఈ నెల 15న తన భార్య పద్మకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. వెంటనే తన బామ్మర్దికి ఫోన్ చేసి ఆరా తీయగా మా ఇంటికి రాలేదని చెప్పాడు. పద్మ కోసం బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. పద్మ ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు ఆరు తులాల బంగారం పట్టుకెళ్లిందని పద్మ భర్త నర్సింహులు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకుక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## కుంట కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి



తూప్రాన్, జూన్ 16: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో సర్వే నెం.415లో ఉన్న సర్వే కుంటను కబ్జా చేస్తున్న ఓ వ్యక్తిపై చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు ఇరిగేషన్ డీఈకి సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కుంటను అక్రమిం చిన కబ్జాదారుడి నుంచి విడిపించాలని కోరారు. దీంతో చుట్టు పక్కల, దిగువ రైతులకు మేలు జరుగుతుందని పలువురు రైతులు ఇరిగేషన్ డీఈకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సెక్కడ..?

- మెరుగైన రహదారి ఉన్నా ప్రయోజనం సున్నా..
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- బస్సులు నడపాలని విన్నవించినా పట్టించుకోని అధికారులు



గౌతాపూర్ నుంచి బస్సు లేక నడుచుకుంటూ కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు



నర్సాపూర్-జోగిపేట ప్రధాన రోడ్డుపై బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

చిలిపిచెడ్, జూన్ 16: అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది మారుమూల గ్రామాల పరిస్థితి. చిలిపిచెడ్ మండలంలోని గౌతాపూర్, అజ్జమర్రి, సోమక్కపేట, రాందాస్‌గూడ, సామ్ల్యా తండా, రహీంగూడ తండా, టోప్యి తండా, గన్య తండా, గూజిరి తండా ప్రజలకు ఆర్టీసీ బస్సుల సేవలు అందడంలేదు. మండలంలోని ఆయా గ్రామాలు, గిరిజన తండాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట, సంగారెడ్డి, నర్సాపూర్‌లో చదువుల కోసం రోజూ వందలాది విద్యార్థులు వెళ్తుంటారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తున్నది. కౌడిపల్లి మండలం నుంచి వయా సోమక్కపేట, రాందాస్ గూడ, సామ్ల్యా తండా, రహీంగూడ, శీలాంపల్లి, గౌతాపూర్, గూజిరి తండా, టోప్యి తండా, గన్య తండాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై బస్సులు నడపడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఈ దారిలో బస్సులు నడిపితే చిలిపిచెడ్, కౌడిపల్లి, నర్సాపూర్, జోగిపేటకు గిరిజన గ్రామాల ప్రజలు, విద్యార్థులకు ప్రయాణం సులువు అవుతుంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు.

### గ్రామాలకు బస్సులు నడపాలి



గౌతాపూర్, గన్య తండా, టోప్యి తండా నుంచి చిలిపిచెడ్‌కు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లాలంటే జోగిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గౌతాపూర్, గన్య తండా నుంచి నర్సాపూర్, జోగిపేట ప్రధాన రోడ్డు వరకు 7కిలో మీటర్లు దూరం నడిచి వచ్చినా మళ్లీ బస్సు కోసం గంటలకొద్దీ సమయం వేచి చూడాల్సి వస్తున్నది. బస్సు సౌకర్యం లేకపోవడంతో రోజూ మొదటి క్లాస్ మిస్సవుతున్నాం. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, మండల ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బస్సు సౌకర్యం కల్పించాలి.

**- కుమార్, విద్యార్థి, గన్య తండా, గౌతాపూర్**

# ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దు

- 85 దరఖాస్తులు స్వీకరణ
- కలెక్టర్ రాహుల్ రాజ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



వినతిపత్రం ఇస్తున్న రామాయంపేట యువకులు

మెదక్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ రా హుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మొత్తం (85) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ సమస్యలు -36, పింఛన్లు -02 ఇందిరమ్మ ఇండ్లు -17, ఇతర సమస్యలు -30 మొత్తం 85 వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### లేబర్ ఆఫీసర్‌ను అందుబాటు ఉంచాలి

రామాయంపేట, జూన్ 16: రామాయంపేటలో లేబర్ ఆఫీసర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్‌ను రామాయంపేట వాసులు సోమవారం ప్రజావాణిలో కోరారు. మండల కేంద్రంలో ఉండాల్సిన లేబర్ ఆఫీసర్ ఎక్కడో ఉండడం పద్ధతి కాదని, స్థానికంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రామాయంపేట యువకులు కలెక్టర్‌ను కోరారు.

# అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ





అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు



మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్16: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 18 ఫిర్యాదులు స్వీకరించారు.

### అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

అల్లాదుర్గం, జూన్ 16: అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి,ఎస్ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దశంకరంపేట, జూన్16: దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పీఎస్‌లో పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పెద్దశంకరంపేట ఎస్ఐ ప్రవీన్‌రెడ్డి తదితరులున్నారు.

### రేగోడ్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

రేగోడ్,జూన్16: రేగోడ్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఏవిధమైన కేసులు వస్తాయి, వాటిని ఏవిధంగా పరిష్కరించాలో సీఐ రేణుక, ఎస్సై పోచయ్య, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# పరిహారం ఇవ్వకుండానే భూసేకరణ సరికాదు



తూప్రాన్: ఘనపూర్‌లో ఆందోళన చేస్తున్న అసైన్డ్ భూముల రైతులు



పాపన్నపేట, రామాయంపేటలో రెవెన్యూ సదస్సులు

**- రెవెన్యూ సదస్సులో రైతుల ఆందోళన**

తూప్రాన్, జూన్ 16: తూప్రాన్ మండలంలోని ఘనపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అసైన్డ్ భూమి (డీఫాం) పట్టాదారులు ఆందోళన చేపట్టారు. పరిశ్రమల కోసం భూసేకరణ చేస్తున్న ప్రభుత్వం తమకు పరిహారం ఇవ్వడం లేదని ఆరోపించారు. అనర్హులను రికార్డుల్లో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తమ భూములకు సైతం పరిహారం చెల్లించి, భూ సేకరణ చేయాలని, డీ ఫాం పట్టా సర్టిఫికెట్లను పట్టుకుని రెవెన్యూ సదస్సు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. పోలీసులు ఆందోళనకారులను సముదాయించారు. ఆర్డీవో జయచంద్రారెడ్డి కల్పించుకుని రైతులు తమ పట్టాదారు సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌బుక్కుల నకళ్లను అందజేయాలని, రెండు నెలల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

పాపన్నపేట, జూన్ 16: భూ సమస్యల పరిష్కానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. కొత్తపల్లి పంచాయతీలో భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. భూ సమస్యలున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్కడ ఉన్న రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

### దంతేపల్లిలో..

రామాయంపేట, జూన్ 16: సమస్యల పరిష్కారానికి భూభారతి సదస్సులు పెట్టిందని తహసీల్దార్ రజినీ కుమారి పేర్కొన్నారు. మండలంలోని దంతెపల్లిలో రెవెన్యు సదస్సు ప్రారంభించి, పలు సూచనలు చేశారు. గ్రామ కార్యదర్శి, ఆర్ఐ.గౌస్ రైతులున్నారు.

# 19 నుంచి క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

పాపన్నపేట, జూన్ 16: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో చేరడానికి ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక కొనసాగుతాయని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని పాఠశాలల్లో చేరడానికి విద్యార్థుల ఎంపిక కొనసాగుతుందన్నారు. మండల స్థాయి ఎంపికలు 19 నుంచి పాపన్నపేట ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తామన్నారు. ఎనిమిది నుంచి తొమ్మిది ఏండ్ల వయసు గలవారు ఈ పాఠశాలల్లో చేరడానికి అర్హులని వెల్లడించారు. మిగతా వివరాలకు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి 8500200859, ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ 9010735121 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా వారు సూచించారు.

### స్పోర్ట్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

రేగోడ్, జూన్16: స్పోర్ట్స్ పాఠశాలలో దరఖాస్తులకు ఈ నెల 18 వరకు చివరి తేదీ అని ఎంఈవో గురునాథ్ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 3వ తరగతి పాసైన విద్యార్థులు ఎంఆర్‌సీ రేగోడ్‌లో వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా స్పోర్ట్స్ పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు కొన్ని ఆటలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. జూలై 1 నుంచి 5వతేదీ వరకు పోటీలు నిర్వహిస్తారన్నారు. జూలై 18, 19వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి 22 తేదీ వరకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. స్పోర్ట్స్ పాఠశాల హకీంపేట్‌లో దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన పత్రాలు అందిచాలని ఎంఈవో పేర్కొన్నారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 16: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో నాల్గో తరగతి విద్యార్థుల ఎంపికలను ఈనెల 19న రామాయంపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని ఎంఈవో.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లలో క్రీడా పాఠశాలలున్నాయన్నారు. పూర్తి వివరాలకు పీడీ.నాగచందర్ 9440094808, సిద్ధరాములు పీఈటీ 7794050660లను సంప్రదించాలన్నారు.

## గుంతల రోడ్డుతో ఇబ్బందులు



గుంతలమయంగా ఉన్న కోమటిపల్లి టీఎస్ మాడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు

రామాయంపేట, జూన్ 16: మున్సిపాలిటీలోని కోమటిపల్లిలో తెలంగాణ మాడల్ స్కూల్ రోడ్డులో గుంతల ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో సోమవారం మాడల్ స్కూల్‌కు వెళ్లే ఆటోలు రోడ్డుపైనే నిలిపి విద్యార్థులను వదిలివెళ్లిపోయారు. దీంతో విద్యార్థులు అర కిలోమీటర్ మేర నడిచి పాఠశాలకు వెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీలో 57 శాతం ఉత్తీర్ణత

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 16: మే 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరంలో 3626 మంది, ద్వితీయ సంవత్సరంలో 2214 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 5840 మందికి 3373 మంది (57.75 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు నోడల్ అధికారిణి మాధవి తెలిపారు.

## కొనసాగుతున్న వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక



తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన పరుస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 16: మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా సోమవారం 8వ వార్డులో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలి



రాయిలాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన రైతులు

రామాయంపేట, జూన్ 16: అధిక దిగుబడినిచ్చే పంటలనే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం రామాయంపేట మండలంలోని రాయిలాపూర్, కాట్రియాల గ్రామాల్లోని రైతువేదికల్లో సీఎంతో ముఖాముఖి వీడియో కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడిన అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల దిగబడిపై పలు సూచనలు చేశారు.రైతులు ముందుగా తమ భూములను భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. కాన్ఫరెన్సులో రామాయంపేట డివిజన్ ఇన్‌చార్జి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, ప్రవీణ్, సాయికృష్ణ ఉన్నారు.

## పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి

**- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

తూప్రాన్, జూన్ 16: పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తూప్రాన్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని, పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర నగేశ్, ఆర్డీవో మహిపాల్‌రెడి

నర్సాపూర్, జూన్16: మండలంలోని ఆవంచ గ్రామంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం-రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరితోపాటు ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో మధులత, పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఏఈవో రుతు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఆవంచ క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలో పుస్తకాల వ్యాపారం అరికట్టాలి

చేగుంట, జూన్ 16: చేగుంటలోని పలు ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ చేగుంట ఎంఈవోకు నీరజకు విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు జగన్ సోమవారం వినతి పత్రం అందజేశారు.

## 57 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ఏర్పాటు

పాపన్నపేట,జూన్ 16: సుమారు 2కోట్లతో 57 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం పాపన్నపేట మండలం పొడ్చాన్‌పల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసే ప్రభుత్వమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2లక్షల 26వేల మంది రైతులకు రైతు భరోసా రూ.140 కోట్లు వారి అకౌంట్‌లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 35 వేల మందికి రాబోవు తొమ్మిది రోజుల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద నాయక్, శ్రీకాంతప్ప, ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి కొడుకు తీవ్ర గాయాలు

చేగుంట, జూన్16: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. కొడుకు తీవ్ర గాయాలైన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం పులిమామిడి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన గుండెల్లి చంద్రయ్య(50), అతని కుమారుడు పరశురాములు రామాయంపేట మండలం డీ ధర్మాంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పులిమామిడి చౌరస్తా వద్ద ఎదరుగా వచ్చిన ట్రాక్టర్‌ను బైకు ఢీకొన్నది. దీంతో చంద్రయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు పరుశురాములుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.